క్లుప్తంగా

ఖాదీ వస్త్రాలు ధరించాలి



సిరిసిల్లటౌన్: ప్రజలు ఖాదీ వస్త్రాలు ధరించాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖాదీ భండార్‌ను బుధవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఖాదీ వస్త్రాలను 40 శాతం డిస్కౌంట్‌తో విక్రయిస్తున్నారని తెలిపారు. కౌన్సిలర్ పత్తిపాక పద్మ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఖాదీ భండార్ మేనేజర్ ఆడెపు రమేశ్, నాయకులు లక్ష్మీరాజం, ఎండీ.సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో హైడ్రా కమిషనర్ సతీమణి



వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సతీమణి లావణ్య బుధవారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు, వేద పండితులు ఆమెకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, ఆశీర్వచనం గావించారు.

రైతుబిడ్డకు ఎంబీబీఎస్ సీటు



తల్లిదండ్రులతో విష్ణువర్ధన్‌రెడ్డి

కోనరావుపేట: పల్లిమక్తకు చెందిన కదిరె దుర్గారెడ్డి–పద్మ దంపతుల కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఎంబీబీఎస్ సీటు సాధించాడు. వీరిది వ్యవసాయ కుటుంబం. నీట్ రాసిన విష్ణువర్ధన్‌రెడ్డి 585 మార్కులతో సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) గోదావరిఖనిలో ఎంబీబీఎస్ సీటు పొందాడు. అతన్ని గ్రామస్తులు బుధవారం అభినందించారు.

గిరిజన విద్యార్థినికి..



కృష్ణ శ్రీ

వీర్నపల్లి: గర్జనపల్లి సీతారాం నాయక్ తండాకు చెందిన ఆర్‌ఎంపీ ఈశ్వర్ కూతురు కృష్ణ శ్రీ హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆమె తండ్రి మృతిచెందగా, తల్లి కవిత కరీంనగర్ డీపీఆర్వో కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తోంది. సోదరుడు ఐఐటీ నాగాలాండ్‌లో సీటు సాధించాడు. కృష్ణ శ్రీ మాట్లాడుతూ.. తన తండ్రి పేరిట ఆస్పత్రి స్థాపించి, పేద ప్రజలకు వైద్య సేలందించడమే లక్ష్యమని తెలిపింది.

బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి నియామకం



ఎల్లారెడ్డిపేట: రాచర్లగుండారం గ్రామానికి చెందిన బోదావత్ రవీందర్‌నాయక్ బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. బుధవారం ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఆయనకు నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణలకు రవీందర్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

బతుకమ్మ నిమజ్జనానికి వెళ్లి, జారిపడి..

- వృద్ధురాలికి గాయాలు

తంగళ్లపల్లి: లక్ష్మీపూర్‌లో బుధవారం ఎంగిలి పూల బతుకమ్మ నిర్వహించారు. రాత్రి బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు మహిళలు బతుకమ్మ తెప్ప వద్దకు వెళ్లారు. ఆ సమయంలో కనకవ్వ అనే వృద్ధురాలు జారి కిందపడిపోగా కాలుకు గాయాలయ్యాయి. స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి, కారోబార్‌కు ఏర్పాట్లు చేయాలని విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎల్లమ్మ ఆలయ కమిటీ ఎన్నిక



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పందిర్ల లింగంగౌడ్, వైస్ చైర్మన్‌గా పుల్లయ్యగారి తిరుపతిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా గంట వెంకటేశ్‌గౌడ్, కోశాధికారిగా గుండెల్లి శ్రీనివాస్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.



బోయినపల్లి: స్కూల్ అడ్డా వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఎల్లారెడ్డిపేటలో..



రుద్రంగిలో..



వీర్నపల్లిలో..

ఎంగిలి పూల సంబురం

సిరిసిల్ల అర్బన్/ముస్తాబాద్/కోనరావుపేట/తంగళ్లపల్లి/గంభీరావుపేట/రుద్రంగి/వేములవాడరూరల్/చందుర్తి/వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి: జిల్లాలో ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు, యువతులు, చిన్నారులు బుధవారం సంబురంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, ఒక్కచోట చేరి, ఆడిపాడారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు, చిన్న బోనాల, పెద్ద బోనాల, జగ్గారావుపల్లి, పెద్దూరు, చంద్రంపేట, సర్దాపూర్‌తో పాటు ముస్తాబాద్, కోనరావుపేట, తంగళ్లపల్లి, గంభీరావుపేట, రుద్రంగి, వేములవాడ రూరల్, చందుర్తి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, బోయినపల్లి మండలాల్లోని గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.



చందుర్తిలో..



కనగర్తిలో..



ముస్తాబాద్‌లో..



రగుడులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు



గంభీరావుపేటలో..



అంకిరెడ్డిపల్లెలో..

గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి





సిరిసిల్ల: కాంగ్రెస్ నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కళ, నాయకులు, ఎల్లారెడ్డిపేటలో...

సిరిసిల్లటౌన్: జాతిపిత గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, పలువురు వక్తలు అన్నారు. బుధవారం సిరిసిల్ల గాంధీ సర్కిల్‌లో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ జిందం కళ, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీఎస్పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూప తదితరులు పాల్గొన్నారు. పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, నాయకులు శీలం రాజు, శ్రీగాధ మైసయ్య, చొప్పదండి అంజన్న, గాజుల వేణు తదితరులు హాజరయ్యారు.

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ 17వ బెటాలియన్‌లో గాంధీ చిత్రపటానికి కమాండెంట్ శ్రీనివాసరావు నివాళి అర్పించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరిసిల్ల కల్చరల్: పట్టణంలోని పలువురు సీనియర్ సిటిజన్లు బుధవారం గాంధీజీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళి అర్పించారు. ఆల్ సీనియర్ సిటిజన్ల సంఘం ప్రతినిధులు చేపూరి బుచ్చయ్య, డాక్టర్ జనపాల శంకరయ్య, ఏనుగుల ఎల్లయ్య, మేరుగు లక్ష్మణ్, జి.కైలాసం, అంకారపు జ్ఞానోభ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గాంధీ జయంతి నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో, మార్కెట్‌యార్డు కార్యాలయాలు, పలు గ్రామాల్లో గాంధీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు నివాళి అర్పించారు. తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో జయశీల, ఎస్సై పృథ్వీధర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, డైరెక్టర్లు తదితరులున్నారు.

చందుర్తి: మహాత్మాగాంధీ కలలుగన్న స్వరాజ్యాన్ని సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టె ప్రభాకర్ కోరారు. చందుర్తి మండల కేంద్రంలో బాపూజీ విగ్రహానికి నివాళి అర్పించారు. పార్టీ సోషల్ మీడియా వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ మల్లేశం, నాయకులు పులి సత్యం, దారం చంద్రం, ఉలిసె ఆంజనేయులు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. నాయకులు కేక్ కట్ చేశారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలంలో గాంధీ జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్, పోతుగల్, ఆవునూర్, నామాపూర్, చిప్పలపల్లి, మద్దికుంట, కొండాపూర్ లలోని గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే, మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో బాపూజీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు హమీద్, నాయకులు పూలమాలలు వేశారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాపూజీ చిత్రపటానికి ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి రెడ్డి నివాళి అర్పించారు. మండలంలోని గ్రామాల్లో గాంధీ జయంతి నిర్వహించారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని గాంధీజీ విగ్రహానికి కాంగ్రెస్ మండల నాయకులు నివాళి అర్పించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై అశోక్, సిబ్బంది బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు.



ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీ పాత భవనంలోని వాటర్ ప్లాంట్ మూడేళ్లుగా నిరుపయోగంగా ఉంటోంది. సామగ్రి తుప్పు పట్టింది. పంచాయతీ కార్యాలయాన్ని కొత్త భవనంలోకి మార్చారు. పాత భవనంలో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేశారు. అయితే, వినియోగంలో లేని వాటర్ ప్లాంట్ దీని ఆవరణలోనే ఉంది. దీంతో అధికారులు, సిబ్బందితోపాటు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు, ధ్రువపత్రాల కోసం వచ్చే దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
రమేశ్, పంచాయతీ కార్యదర్శి, ముస్తాబాద్, 98669 64956

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



రోడ్డు శుభ్రం చేస్తున్న రామకృష్ణ, నాయకులు

వేములవాడ: ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం వేములవాడ పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో పారిశుధ్య కార్మికులతో కలిసి వీధులు శుభ్రం చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్దనున్న బాపూజీ విగ్రహానికి నివాళి అర్పించారు. కౌన్సిలర్ సంతోష్‌బాబు, నాయకులు నాయకులున్నారు.

సంక్షిప్త వార్తలు

● నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి

చందుర్తి: దేవీ శరన్నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండపాల నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నవరాత్రులు ముగిసేవరకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలని, డీజేలు, లౌడ్ స్పీకర్లు పెట్టొద్దని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్సై బాపు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బోయినపల్లి: మండలంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై పృథ్వీధర్ అన్నారు. బుధవారం సాయంత్రం మండపాల నిర్వాహకులతో ఠాణాలో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు.

● మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: దేశ భవిష్యత్తుకు వెన్నెముకగా ఉండే యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ ఎడమల శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని అగ్రహారంలో డ్రగ్స్, గంజాయి నిషేధంపై బుధవారం సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు తమ ఆటపాటలతో ప్రభుత్వ పథకాలు, గంజాయిపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి విక్రయాలు, కొనుగోలు, రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. జిల్లా నుంచి ప్లాస్టిక్ మహమ్మారిని తరిమివేయాలని కోరారు. కళాకారులు రామచంద్రం, శ్రీనివాస్, పర్శరాములు, గణేశ్ పాల్గొన్నారు.

● కస్తూరిబాలో విద్యుత్ దీపాల ఏర్పాటు

వీర్నపల్లి: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఆవరణలో, బయట మండల పరిషత్ అధికారులు బుధవారం సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పెరిగిన గడ్డి, చెత్తాచెదారం తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఎంపీడీవో రఘురాం, ఎంపీవో వాజిద్ ఉన్నారు

● పారిశుధ్య కార్మికులకు సన్మానం

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీవో మీర్జా బేగ్ ఆధ్వర్యంలో జీపీ కార్మికులకు సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి రఘువీరారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, ఉప సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి: బూర్గుపల్లి, బోయినపల్లి గ్రామాల పంచాయతీ పారిశుధ్య కార్మికులను ఎంపీడీవో జయశీల బుధవారం సన్మానించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

● సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన

కోనరావుపేట: తెలంగాణ భాషా సాంస్కృతిక, పెరల్ ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో సుద్దాలలోని రుషివాణి విద్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించారు. వాటిని బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించనున్నట్లు శిక్షకుడు సుంకరి శరత్ తెలిపారు. మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఇసుక లారీ, ట్రాక్టర్ సీజ్

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ శివారులో బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక లారీ, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. ఇసుక తరలిస్తున్న శివరాత్రి రాజు, కొంపెల్లి బాలకిషన్, కంచర్ల బాలరాజులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

'గూండాయిజాన్ని ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్'



మాట్లాడుతున్న మధు, పక్కన నాయకులు

తంగళ్లపల్లి: కాంగ్రెస్ నాయకులు గూండాల్లా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు ఆరోపించారు. బుధవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ గూండాయిజాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల అవినీతికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. ఆయన వెంట నాయకులున్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల నిరసన

సిరిసిల్లటౌన్: మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌పై జరిగిన దాడిని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ ఖండించారు. బుధవారం సిరిసిల్ల గాంధీచౌక్‌లో నాయకులతో కలిసి, నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపారు.


కేటీఆర్ కాన్వాయ్‌పై దాడి అప్రజాస్వామికం

ముస్తాబాద్: మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ నాయకుల దాడి అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు అన్నారు. ముస్తాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. జెడ్పీ కో–ఆప్షన్ మాజీ సభ్యుడు సర్వర్, పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఉన్నారు.

బెదిరింపులకు పాల్పడిన ముగ్గురి రిమాండ్

వేములవాడ: రాజన్న భక్తులను చంపుతానని బెదిరించి, డబ్బులు వసూలు చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడటౌన్ సీఐ వీరప్రసాద్ బుధవారం రాత్రి తెలిపారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం వెంకట్రావుపేటకు చెందిన ఈదుగల రాజు తన కుటుంబ సభ్యులతో కలిసి రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు ఈనెల 1న వచ్చాడు. తన ఆటోలో వేములవాడ పార్కింగ్ ఏరియాలో పెట్టి అందులోనే అతడు, అతని సోదరుడు కొడిశెల సంతోష్ పడుకున్నారు. తెల్లవారుజామున సుందరవేణి శివ, సూర ప్రశాంత్, కురుకుంట బాబు వీళ్లు పడుకున్న ఆటో దగ్గరికి వచ్చి చంపుతామని బెదిరించి, డబ్బులు వసూలు చేసి, పరారయ్యారు. రాజు, సంతోష్ ఫిర్యాదుతో ఆ ముగ్గురిని పట్టుకొని, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

బతుకు పోరులో.. బాబు రక్షణలో



బాలుడిని చున్నీతో ఇటుకకు కట్టి, తాపీమేస్త్రీ పని చేస్తున్న దీపక్

బోయినపల్లి: బాలుడు బయటకు వెళ్లకుండా ఇటుకకు కట్టేశారు.. తర్వాత తమ పనిలో నిమగ్నమయ్యారు వలస కార్మిక దంపతులు.. ఈ దృశ్యం బతుకు పోరుకు అద్దం పడుతోంది. వివరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కార్మికులు చల్లు–దీపక్ దంపతులు ఐదేళ్ల క్రితం వేములవాడకు వచ్చారు. భార్య లేబర్‌గా, భర్త తాపీమేస్త్రీగా పని చేస్తున్నారు. లేబర్ అడ్డా నుంచి రోజూ కూలీకి వస్తారు. బుధవారం బోయినపల్లి మండలం రామన్నపేటలో ఓ ఇంటి మరమ్మతుకు వెళ్లారు. వెంటే ఉన్న తమ ఏడాదిన్నర బాబు అక్కడి నుంచి బయటకు వెళ్తే ఏదైనా ప్రమాదం జరగవచ్చని భావించారు. ఆ చిన్నారి నడుముకు చున్నీ చుట్టి, సిమెంట్ ఇటుకకు కట్టేశారు. తర్వాత తమ పనులు చేసుకున్నారు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.